10082024-DIS-08_Layout 1 8/10/2024 3:50 AM Page 1

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

కుటుంబ పాలన ఎవరిది?

కోడలికి బుద్ధి చెప్పి అత్త తెడ్డు నాకిందన్నట్టుగా.. నిన్నటిదాక కేసీఆర్ ప్రభుత్వాన్ని కుటుంబపాలన అని విమర్శించిన కాంగ్రెస్ పార్టీ ఇపుడు పూర్తిగా బరితెగించి రాష్ట్రాన్ని, రాష్ట్ర సంపదను కాంగ్రెస్ కుటుంబాలకు ధార పోస్తున్నది. కేసీఆర్ కుటుంబంలోని ప్రతి ఒక్కరూ 14 ఏండ్లు రాష్ట్రసాధన పోరాటంలో పాల్గొన్నారు. నిర్బంధాలు, జైళ్లు లెక్క చేయకుండా ఉద్యమించారు. కేసీఆర్ వారికి టిక్కెట్లిస్తే ప్రజల ముందుకు వెళ్లి ఒకటికి నాలుగు సార్లు వారి ఆశీర్వాదంతో చట్టసభల్లోకి వచ్చారు తప్ప బలవంతపు రుద్దుళ్లు కాదు. అయినా సరే.. కాంగ్రెస్ కుటుంబ పాలన అంటూ కోడై కూస్తే దానికి పచ్చ మీడియా, పచ్చళ్ల మీడియా వంత పాడింది. బురద చల్లింది. మరి ఇవాళ జరుగుతున్నదేమిటి? సీఎం తమ్ముడు అనధికారిక ఎమ్మెల్యేగా కొనసాగుతాడు. ప్రభుత్వ కార్యక్రమాల్లో వేదికపై తిష్ట వేస్తాడు. మరో సోదరుడు తన వ్యాపారం కోసం క్విడ్ ప్రో కో అనదగిన రీతిలో ఎంవోయూలు చేసుకుంటాడు. ఇంకో సోదరుడు ప్రభుత్వ వ్యవహారాల్లో షాడో సీఎంగా చెలామణి అవుతాడు. మరి గల్లీ కాంగ్రెస్ నాయకుడి నుంచి మహారాజశ్రీ రాహుల్‌గారి వరకు అంతా కుటుంబ పాలన అంటూ చేసిన విమర్శలు ఏమైనట్టు? ఇవాళ రాష్ట్రంలో సగం జిల్లాల్లో కుటుంబాల పాలన కొనసాగుతున్నది. జిల్లాకు ఒకటి రెండు కుటుంబాలు అధికారాన్ని పంచుకుతింటున్నారు. కుటుంబపాలన విశ్వరూపం కళ్లముందు కనిపిస్తున్నది. ఎన్ని కుటుంబాలు? ఎంత అరాచకం? పైగా తప్పేమిటని ఆ పార్టీవారే దబాయిస్తున్నారు. ఎన్నికల సమయంలో కుటుంబ పాలన అంటూ రాష్ట్రమంతా ఊదరగొట్టిన రాహుల్ ఈ కుటుంబాల పాలన చూసి ఏం చేస్తున్నట్టు? పార్లమెంటులో నిద్రపోతే ఓకే. కానీ తమ పార్టీ ప్రభుత్వం ఎలాగుందో దాని పనితీరు ఏమిటో కూడా చూడాలిగదా? ఎదుటి వారికి చెప్పిన నీతి సూత్రాలు తాము పాటించాలి గదా!

ఎడిటోరియల్ డెస్క్

ఏ పార్టీ అయితే కేసీఆర్‌ది కుటుంబ పాలన అని ఆరోపించిందో, అదే కాంగ్రెస్ సర్కారులో కొందరు సీనియర్ నేతల కుటుంబాలే పెత్తనం చెలాయిస్తున్నాయి. అసలు ఆ మాటకొస్తే వారసత్వ రాజకీయాలపై పేటెంట్ హక్కు ఏ పార్టీకైనా ఉందంటే అది కాంగ్రెస్‌కే అన్నది చారిత్రక సత్యం. నెహ్రూ నుంచి రాహుల్‌గాంధీ వరకు కాంగ్రెస్‌లో రాజకీయ వారసత్వం కొనసాగుతూనే వస్తున్నది. రాష్ట్ర రాజకీయాల్లోకి వస్తే.. సీఎం రేవంత్‌రెడ్డి హయాంలో కాంగ్రెస్ ప్రభుత్వం మరో అడుగు ముందుకేసింది. కుటుంబ వారసత్వ రాజకీయాలకు, స్వీయ సామాజిక వర్గాన్ని జోడించి కొత్త ట్రెండ్‌కు శ్రీకారం చుట్టింది. ఆయన తన సామాజికవర్గానికి చెందిన నాయకులు, అధికారులకే ప్రభుత్వంలో పెద్దపీట వేశారని సొంత పార్టీ నాయకులే విమర్శిస్తున్నారు. గతంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు ఎన్నడూ ఈ పరిస్థితి లేదని చెప్పక తప్పదు. ప్రభుత్వంలో కీలక శాఖలు, బాధ్యతలు ఒకే సామాజికవర్గానికి చెందిన నాయకులు, అధికారులకు అప్పగించిన దాఖలాలు ముసుపెన్నడూ లేవని పలువురు గుర్తుచేస్తున్నారు. బడుగు, బలహీనవర్గాలకు చెందిన పార్టీగా చెప్పుకొనే కాంగ్రెస్.. ప్రస్తుతం అగ్రకుల నేతల ఆధిపత్యంలోకి వెళ్లటం, ఉదయపూర్‌లో కాంగ్రెస్ ప్లీనరీ-2022లో చేసిన తీర్మానానికి తూట్లు పొడిచేలా ఉన్నదని ఆ పార్టీ అధిష్ఠానం కూడా కలవరపడుతున్నట్టు తెలుస్తున్నది. ఈ క్రమంలో కనీసం పీసీసీ అధ్యక్ష పదవి అయినా బీసీ సామాజికవర్గానికి కట్టబెట్టకపోతే పార్టీకి ఓటు బ్యాంకుగా ఉంటున్న బడుగు, బలహీనవర్గాలు దూరం అవుతారేమోనని ఆందోళన చెందుతున్నట్టు చెప్పుకొంటున్నారు.

సగం జిల్లాల్లో కొన్ని కుటుంబాలదే పెత్తనం

ఉమ్మడి పది జిల్లాల్లో సగం జిల్లాల్లో కొన్ని కుటుంబాలే పదవులు, అధికారాన్ని అనుభవిస్తున్నాయి. ఖమ్మం, నల్లగొండ, వరంగల్, మహబూబ్‌నగర్, ఆదిలాబాద్, మెదక్ జిల్లాల్లో ప్రభుత్వాన్ని కొన్ని కుటుంబాలే శాసిస్తున్నాయని సొంత పార్టీ నేతలే విమర్శిస్తున్నారు. ఒకే కుటుంబం నుంచి ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులుగా కొనసాగుతూ పార్టీని, ప్రభుత్వాన్ని తమ గుప్పిట్లో పెట్టుకొన్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. నామినేటెడ్ పోస్టులూ ఇతరులకు ఇవ్వకుండా మోకాలడ్డుతున్నారని సొంత పార్టీ నేతలే మండిపడుతున్నారు.

• ఖమ్మంలోనూ మూడు కుటుంబాలు

ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి మల్లు భట్టి విక్రమార్క డిప్యూటీ సీఎంగా, తుమ్మల నాగేశ్వర్‌రావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మంత్రివర్గంలో కొనసాగుతుండగా, ఖమ్మం ఎంపీగా రామసహాయం రఘురామిరెడ్డి ఉన్నారు. ఈయన పొంగులేటికి స్వయానా వియ్యంకుడు. రఘురామిరెడ్డిది కూడా కాంగ్రెస్ కుటుంబమే. ఈయన తండ్రి రామసహాయం సురేందర్‌రెడ్డి వరంగల్ మాజీ ఎంపీ. భట్టి విక్రమార్క తన భార్య నందినికి ఖమ్మం ఎంపీ టికెట్ ఇప్పించేందుకు చివరిదాకా తీవ్రంగా ప్రయత్నించారు. భట్టి సోదరుడు మల్లు రవికి నాగర్‌కర్నూల్ నుంచి ఎంపీ టికెట్ ఇవ్వడంతో నందినికి ఖమ్మం టికెట్ దక్కలేదు. పొంగులేటి తన సోదరుడు ప్రసాద్‌రెడ్డి, మరో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తన కుమారుడు యుగంధర్ కోసం చివరిదాకా ప్రయత్నించినా ఆఖరికి పొంగులేటి తన వియ్యంకుడు రఘురామిరెడ్డికి టికెట్ ఇప్పించుకోవటంలో సఫలమయ్యారు.

• నల్లగొండలో ఫ్యామిలీ ప్యాక్!

కాంగ్రెస్‌లో కుటుంబ పాలన గురించి చెప్పుకోవాల్సి వస్తే మొదటగా వినిపించే పేరు ఉమ్మడి నల్లగొండ జిల్లానే. ఇక్కడి నుంచి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మంత్రులుగా కొనసాగుతుండగా.. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి భార్య పద్మావతి కోదాడ ఎమ్మెల్యేగా, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సోదరుడు రాజగోపాల్‌రెడ్డి మునుగోడు ఎమ్మెల్యేగా ఉన్నారు.

ఇదే జిల్లాకు చెందిన మరో సీనియర్ నేత కుందూరు జానారెడ్డి కుమారులలో జైవీర్‌రెడ్డి నాగార్జునసాగర్ ఎమ్మెల్యే, మరో కుమారుడు రఘువీర్‌రెడ్డి నల్లగొండ ఎంపీ. ఇప్పటికే నల్లగొండ జిల్లా నుంచి ఇద్దరికి మంత్రి పదవులు ఉండగా, మూడో మంత్రి పదవి కూడా సోదరుడు రాజగోపాల్‌రెడ్డికి ఇవ్వాలని కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రయత్నిస్తున్నారు. ఒకే కుటుంబంలో ఇద్దరికి మంత్రి పదవులు ఇచ్చేటట్టయితే తన భార్య పద్మావతికి కూడా మంత్రి పదవి ఇవ్వాలని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పట్టుబడుతున్నారు. నల్లగొండ జిల్లాలో పదవులు, అధికారం ఈ మూడు కుటుంబాలకే పరిమితం కాగా, తాజాగా భువనగిరి ఎంపీగా గెలిచిన చామల కిరణ్‌కుమార్‌రెడ్డి అరంగ్రేటం చేశారు. తన భార్య లక్ష్మికి భువనగిరి ఎంపీ టికెట్ ఇవ్వాలని కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి చివరిదాకా ప్రయత్నించారు. సీఎం రేవంత్‌రెడ్డికి చామల సన్నిహితుడు కావటంతో ఆయనకు టికెట్ దక్కింది. ముమ్మందు ఈ జిల్లాలో చామల కుటుంబం కూడా పదవులు దక్కించుకుంటుందేమో చూడాలి.

• వరంగల్‌లో కడియం, కొండా ఫ్యామిలీ

ఉమ్మడి వరంగల్ జిల్లాలోనూ కాంగ్రెస్‌లో పెత్తనం రెండు కుటుంబాలదే. కడియం శ్రీహరి స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యేగా, ఆయన కూతురు కావ్య వరంగల్ ఎంపీగా ఉన్నారు. మంత్రి కొండా సురేఖ భర్త కొండా మురళి గతంలో ఎమ్మెల్సీగా పనిచేశారు. సురేఖ తన కూతురు సుస్మిత పటేల్‌కు పరకాల ఎమ్మెల్యే టికెట్ కోసం ప్రయత్నించిన విషయం తెలిసిందే.

• మెదక్‌లో దామోదర, జగ్గారెడ్డి

ఉమ్మడి మెదక్ జిల్లాలో మంత్రి దామోదర రాజనరసింహ, సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే తూర్పు జగ్గారెడ్డి కుటుంబాలవీ రాజకీయ వారసత్వమే. మంత్రి దామోదర రాజనరసింహ తండ్రి రాజనరసింహ కూడా కాంగ్రెస్ నాయకుడే.

ఆయన 3 పర్యాయాలు అందోల్ ఎమ్మెల్యేగా పనిచేయగా, ఆయన మరణానంతరం వారసుడిగా దామోదర రాజనరసింహ రాజకీయాల్లోకి వచ్చారు. వైఎస్ఆర్ హయాంలో ఆయన ఉపముఖ్యమంత్రిగా పనిచేశారు. ఇక జగ్గారెడ్డి భార్య నిర్మలా జగ్గారెడ్డి గతంలో స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా పోటీచేసి ఓడిపోయారు. గతంలో ఆమె జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా పనిచేశారు. తాజాగా రాష్ట్ర పారిశ్రామిక మౌలిక వసతులు, అభివృద్ధి సంస్థ చైర్మన్‌గా పదవీ బాధ్యతలు చేపట్టారు. జగ్గారెడ్డి వారసురాలిగా కూతురు జయారెడ్డి ఇప్పటికే రాజకీయ ప్రవేశం చేశారు. ప్రస్తుతం యువజన కాంగ్రెస్‌లో ఆమె పని చేస్తున్నారు. ఇదే జిల్లాకు చెందిన గీతారెడ్డి ఉమ్మడి ఏపీలో మంత్రిగా పని చేశారు. ఈశ్వరీబాయి రాజకీయ వారసురాలిగా గీతారెడ్డి రాజకీయాల్లోకి వచ్చారు.

• ఆదిలాబాద్‌లో వెంకటస్వామి కుటుంబ దర్బార్

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో దివంగత కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, మాజీ కేంద్రమంత్రి వెంకటస్వామి కుటుంబ వారసత్వం దశాబ్దాలుగా కొనసాగుతున్నది. వెంకటస్వామి పెద్ద కుమారుడు వినోద్ గతంలో మంత్రిగా, చిన్న కుమారుడు వివేక్ ఎంపీగా పనిచేశారు.

ప్రస్తుతం చెన్నూరు నుంచి వివేక్, బెల్లంపల్లి నుంచి వినోద్ ఎమ్మెల్యేలుగా కొనసాగుతున్నారు. వెంకటస్వామి కుటుంబం నుంచి మూడవ తరం కూడా రాజకీయాల్లోకి వచ్చారు. వివేక్ కుమారుడు గడ్డం వంశీకృష్ణ ఇటీవల పెద్దపల్లి ఎంపీగా గెలుపొందారు. ఇదే జిల్లాకు చెందిన కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావుది రాజకీయ వారసత్వమే. ఆయన ప్రస్తుతం మంచిర్యాల ఎమ్మెల్యేగా ఉన్నారు. ప్రేమ్‌సాగర్‌రావు భార్య సురేఖ కూడా కాంగ్రెస్‌లో చురుకైన రాజకీయ నాయకురాలే. ప్రస్తుతం ఆమె మంచిర్యాల జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా పనిచేస్తున్నారు. గతంలో సురేఖ సిర్పూర్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు. మంత్రివర్గ విస్తరణలో ప్రేమ్‌సాగర్‌రావుకు స్థానం లభిస్తుందని అంచనా వేస్తున్నారు.

• రాజకీయ వారసత్వాలకు పుట్టినిల్లు పాలమూరు

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా రాజకీయ వారసులకు పుట్టినిల్లు. ప్రస్తుత ప్రజాప్రతినిధులు రాజకీయ వారసులుగానే రాజకీయాల్లోకి వచ్చారు. నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే కూచుకుల్ల రాజేశ్‌రెడ్డి, నారాయణపేట ఎమ్మెల్యే పర్ణికారెడ్డి ఇరువురు వారసత్వంగా రాజకీయాల్లోకి వచ్చినవారే. సీఎం రేవంత్‌రెడ్డికి రాజకీయ వారసత్వం లేకపోయినప్పటికీ బంధుత్వాలు ఉన్నాయి. దివంగత కేంద్ర మంత్రి జైపాల్‌రెడ్డి సోదరుడు పద్మారెడ్డి కూతురు గీతారెడ్డిని రేవంత్‌రెడ్డి వివాహం చేసుకున్నారు.

రేవంత్‌రెడ్డి సోదరుడు తిరుపతిరెడ్డి ప్రత్యక్ష రాజకీయాల్లో లేకపోయినా కొడంగల్ నియోజకవర్గానికి అనధికార ఎమ్మెల్యేగా వ్యవహరిస్తున్నారు. మరో సోదరుడు కొండల్‌రెడ్డి తెరవెనుక రాజకీయాలలో చురుకుగా ఉన్నారు. కామారెడ్డి నుంచి రేవంత్‌రెడ్డి అసెంబ్లీకి పోటీ చేసినప్పుడు అక్కడ కొండల్‌రెడ్డి ఇన్‌చార్జిగా పనిచేశారు. ఇక నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి దివంగత పీసీసీ అధ్యక్షుడు మల్లు అనంతరాములుకు స్వయానా సోదరుడు. మల్లు అనంతరాములు గతంలో నాగర్‌కర్నూల్ ఎంపీగా ఉండగా ఆయన మరణానంతరం ఆయన వారసుడిగా మల్లు రవి రాజకీయాల్లోకి వచ్చారు. మల్లు రవి మరో సోదరుడు భట్టి విక్రమార్క ప్రస్తుతం డిప్యూటీ సీఎంగా కొనసాగుతున్న విషయం తెలిసిందే. ఉమ్మడి ఏపీలో మంత్రిగా పనిచేసిన కోనేరు రంగారావుకు మల్లు రవి స్వయానా అల్లుడు.



నేత	బంధుత్వం
ఉత్తమ్‌కుమార్‌రెడ్డి-మంత్రి	పద్మావతి (భార్య)-ఎమ్మెల్యే
కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి-మంత్రి	కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి(సోదరుడు)-ఎమ్మెల్యే
కుందూరు జానారెడ్డి-మాజీ మంత్రి	జైవీర్ రెడ్డి (కుమారుడు) - ఎమ్మెల్యే రఘువీర్ రెడ్డి (కుమారుడు)- ఎంపీ
మల్లు భట్టి విక్రమార్క-డిప్యూటీ సీఎం	మల్లు రవి (సోదరుడు) - ఎంపీ
పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి-మంత్రి	రామసహాయం రఘురామిరెడ్డి (వియ్యంకుడు) - ఎంపీ
కడియం శ్రీహరి-ఎమ్మెల్యే	కడియం కావ్య (కూతురు) - ఎంపీ
కొండా సురేఖ - మంత్రి	కొండా మురళి (భర్త) - మాజీ ఎమ్మెల్సీ
దామోదర రాజనర్సింహ - మంత్రి	రాజనర్సింహ (తండ్రి) - మాజీ ఎమ్మెల్యే
జగ్గారెడ్డి - మాజీ ఎమ్మెల్యే	నిర్మలా జగ్గారెడ్డి (భార్య) - టీజీఐఐసీ చైర్‌పర్సన్ జయారెడ్డి (కూతురు) - యువజన కాంగ్రెస్ నేత
వివేక్ వెంకటస్వామి- ఎమ్మెల్యే	వెంకటస్వామి (తండ్రి) - కేంద్ర మాజీ మంత్రి గడ్డం వినోద్ (సోదరుడు) - ఎమ్మెల్యే గడ్డం వంశీకృష్ణ (కుమారుడు) - ఎంపీ
కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు - ఎమ్మెల్యే	సురేఖ (భార్య)-మంచిర్యాల జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు
రేవంత్‌రెడ్డి - సీఎం	తిరుపతిరెడ్డి (సోదరుడు)- కొడంగల్ అనధికారిక ఎమ్మెల్యే కొండల్‌రెడ్డి (సోదరుడు) - తెరవెనుక రాజకీయాలు జైపాల్‌రెడ్డి (మామ సోదరుడు) - కేంద్ర మాజీ మంత్రి
ఎన్టీఆర్ - మాజీ సీఎం (దివంగత)	చంద్రబాబు (అల్లుడు) - ఏపీ సీఎం బాలకృష్ణ (కుమారుడు) - ఎమ్మెల్యే లోకేశ్ (మనుమడు (చంద్రబాబు కుమారుడు, బాలకృష్ణ పెద్దఅల్లుడు)- మంత్రి శ్రీభరత్ (మనుమడు (బాలకృష్ణ చిన్నల్లుడు) - ఎంపీ పురందేశ్వరి (కూతురు) - ఎంపీ, బీజేపీ ఏపీ అధ్యక్షురాలు
నారాయణ - ఏపీ మంత్రి	గంటా శ్రీనివాస్‌రావు (వియ్యంకుడు) - ఎమ్మెల్యే



ఏపీలో ఆ కుటుంబమే..

ఉమ్మడి ఏపీలో ప్రారంభమైన కుటుంబ వారసత్వ రాజకీయాలు, రాష్ట్రం విడిపోయిన తర్వాత కూడా ఏపీలో కొనసాగుతున్నాయి. మొన్నటివరకు ఏపీ సీఎంగా ఉన్న జగన్మోహన్‌రెడ్డి దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వారసుడే. తెలంగాణలో కేసీఆర్‌ది కుటుంబ పాలన అని విమర్శించిన కాంగ్రెస్ పార్టీయే ఏపీ పీసీసీ అధ్యక్షురాలిగా వైఎస్ఆర్ కూతురు షర్మిలను నియమించింది. ప్రస్తుతం ఏపీలో అధికారంలోకి వచ్చిన టీడీపీ కూడా ఎన్టీఆర్ రాజకీయ వారసత్వ పార్టీయే. ఎన్టీఆర్ రాజకీయాల్లోకి రాకముందే చంద్రబాబు కాంగ్రెస్ ప్రభుత్వంలో మంత్రిగా పనిచేసినా, ఆయనకు సీఎం పదవి దక్కింది మాత్రం ఎన్టీఆర్ రాజకీయ వారసత్వం పుణ్యానే. ఎన్టీఆర్ అల్లుడు చంద్రబాబు సీఎం, చంద్రబాబు కుమారుడు లోకేశ్ మంత్రి, చంద్రబాబు బావమరిది బాలకృష్ణ ఎమ్మెల్యే, బాలకృష్ణ అల్లుడు శ్రీభరత్ విశాఖపట్నం ఎంపీ, చంద్రబాబు వదిన పురందేశ్వరి బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, రాజమండ్రి ఎంపీ కూడా. గంటా శ్రీనివాస్‌రావు ఎమ్మెల్యేగా ఉండగా, ఆయన వియ్యంకుడు నారాయణ ఏపీ మంత్రిగా ఉన్నారు. ఇలా చెప్పుకుంటూపోతే అంతా కుటుంబ రాజకీయమే.

ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయుల ఆరోగ్యంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. అంతేకాదు, వారి కుటుంబసభ్యుల ఆరోగ్యాన్ని కాపాడాల్సిన బాధ్యత కూడా ప్రభుత్వానిదే. ఇదే విషయాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అనేక సందర్భాల్లో చెప్పారు. కానీ, అమలుకు నోచుకోవడం లేదు.

నగదు రహిత వైద్య సదుపాయం కల్పించాలె

రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు, జర్నలిస్టులకు జారీచేసిన హెల్త్‌కార్డులు ఎక్కడా పని చేయడం లేదు. ఇవి దేనికీ పనికిరావని, ముందుగా నగదు చెల్లించి రీయింబర్స్‌మెంట్ చేయించుకోవాలని ఆసుపత్రుల యాజమన్యాలు ఉచిత సలహాలు ఇస్తున్నాయి. అయితే వైద్యానికి భారీగా ఖర్చవుతుంటే ప్రభుత్వం మాత్రం రూ.2 లక్షలలోపే రీయింబర్స్‌మెంట్ ఇవ్వడం సరికాదు. ప్రజా ప్రభుత్వం అంటున్న రేవంత్ సర్కార్.. ఉద్యోగ, ఉపాధ్యాయ, పింఛనర్లు, వారి కుటుంబసభ్యుల విషయంలో ఉదాసీనంగా వ్యవహరించడం సబబు కాదు. ప్రభుత్వం నిర్లక్ష్యం ఫలితంగా ఈ వర్గాలవారు అప్పుల పాలవుతున్నారు. ఈ నేపథ్యంలో నగదు రహిత వైద్యాన్ని అందించేందుకు వెంటనే చర్యలు తీసుకోవాలని, అన్నిరకాల దవాఖానల్లో హెల్త్ కార్డులు చెల్లుబాటు అయ్యేటట్టు ఉత్తర్వులు జారీ చేయాలని ఉద్యోగ, ఉపాధ్యాయ, పింఛనర్లు కోరుతున్నారు.

- డాక్టర్ ఎస్.విజయభాస్కర్
92908 26988



సమ వాటా కోసం బీసీల పోరు

జూలూరు గౌరీశంకర్

మండల్ కమిషన్ అమలు జరపాలని ఎగిసిన ఉద్యమ పరిణామాల తర్వాత తిరిగి బీసీ చైతన్యం ఇప్పుడు తెలంగాణ అంతటా బలంగా వీస్తున్నది. ఇది ప్రతి బీసీ ఎదను తడుతున్నది. బీసీ కులాల నుంచి ఎగుస్తున్న చైతన్యం ఎటువైపునకు దారితీస్తుందోనని ఆలోచనాపరులు అంచనాలు వేస్తున్నారు. రాజకీయ పార్టీలు సహజంగానే బీసీ చైతన్యాన్ని తమ ఖాతాల్లోకి ఏ విధంగా వేసుకోవాలోనని ప్రయత్నిస్తాయి. బీసీలలో వస్తున్న చైతన్యం ఏ రూపంలో ఎటు దిక్కుగా మళ్లినా రాజకీయ పార్టీలకు తొట్రుపాటు కలిగిస్తుంది. ఈ రకమైన పరిణామాలు ఒకరకంగా బీసీలకు కలిసివచ్చే కాలమైనప్పటికీ రాజకీయ పార్టీలను మాత్రం సంకట పరిస్థితుల్లోకి నెడతాయి.

తెలంగాణలో రాజకీయ పార్టీల తీరుతెన్నులపై బీసీలకు సహజంగానే పలురకాల సంశయాలున్నాయి. దీనికి కారణాలనేకం. బీసీలంతా ఒక్కతాటిపైకి రాకుండా చేయటంలో అగ్రకుల ఆధిపత్యాలు తరతరాలుగా ఎన్ని కుట్రలు, కుతంత్రాలు చేస్తూ వస్తున్నారో తెలిసిందే. ఆ పరంపర కొనసాగింపుగానే రాజకీయ పార్టీలు అదే దారిలో ఇప్పటికీ నడుస్తున్నాయి. బీసీలు సమైక్యం కాకుండా చేయటంలో సఫలీకృతమవుతూ వస్తున్న రాజకీయ పార్టీలకు ఇటీవల బీసీల నుంచి వస్తున్న చైతన్యం కొంతవరకు గందరగోళానికి గురిచేస్తున్నది. బహిరంగంగా ఈ విషయంపై మాట్లాడటానికి ఏ రాజకీయ పార్టీ ముందుకు రాదు. కానీ, బీసీ చైతన్యాన్ని ముక్కలు చేయటానికి, కులాలపరంగా వాళ్ల మధ్య విభజన రేఖలు గీయటానికి మాత్రం అగ్రపర్ణ ఆధిపత్య వర్గాలు ఎన్ని పన్నాగాలైనా పన్నుతాయి. బీసీలను కులాలపరంగా విడదీసేందుకు నిచ్చెన మెట్ల కులవ్యవస్థ పాముపట్టాల ఆటలు ఉండనే ఉన్నవి.

బీసీలు గమ్యం చేరకుండా వారి మధ్య వైరుధ్యాలను సృష్టించేందుకు కొందరు చూస్తారు. అది సాధ్యం కాకపోతే బీసీ నాయకత్వాలను.. పార్టీల వారీగా విభజించి గీతలు గీస్తారు. ఫలానా పార్టీ బీసీలకు అనుకూలమని, ఫలానా పార్టీ వ్యతిరేకమని బీసీల ఐక్యతను దెబ్బతీసే పనులు చేస్తారు. స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని, కులగణన చేయాలని, చట్టసభల్లో రిజర్వేషన్లు కల్పించాలని బీసీ గొంతుకల నుంచి ప్రశ్నలు వస్తుంటే ఆధిపత్య వర్గాలు అనేక విచ్ఛిన్నకర వాదనలు ముందుకు తెస్తున్నాయి. 'బీసీలంతా ఒక్కటికారు' అన్న పాత విషప్రచారానికే కొత్త కోణంలో రంగులు వేసి ముందుకు తెస్తున్నాయి. బీసీ వాదమే లేదని కొందరు వాదనలు లేపుతున్నారు. బీసీ కులగణన చేస్తే దేశసమగ్రత దెబ్బతిని, దేశ సమైక్యత విచ్ఛిన్నమవుతుందని వాదనలు చేస్తున్నారు. చైతన్యంతో మాట్లాడే బీసీలను కాంగ్రెస్ బీసీ, బీఆర్ఎస్ బీసీ, బీజేపీ బీసీ, వామపక్ష బీసీలని రాజకీయ పార్టీల స్టాంపులు వేసి విభజించే ప్రయత్నాలు ముమ్మరంగా చేస్తున్నారు. ఒక రాజకీయ పార్టీలో ఉన్న బీసీలను మరొక రాజకీయ పార్టీలోని బీసీలపైకి ఉసికొల్పినట్టుగానే.. చైతన్యంతో మాట్లాడే బీసీలపైకి బీసీలనే ఉసికొల్పి విభేదాలు సృష్టిస్తున్నారు.

ఆధిపత్య వర్గాలు తమ రాజకీయ పబ్బాలు గడుపుకొనేందుకు ఎస్సీలకు- ఎస్సీలకు మధ్య, బీసీలకు- బీసీలకు మధ్య, ఎస్టీలకు- ఎస్టీలకు మధ్య వైరుధ్యాలను సృష్టించటం రివాజుగా వస్తున్నది. కానీ, ఆధిపత్య వర్గాల ఉక్కుపాదాల అణచివేతలపై బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాలన్నీ ఒక్కతాటిపైకి వచ్చి నిలుస్తాయని, దాన్ని ఆపటం ఎవరి తరం కాదని ఈ నేలపై జరిగిన ఐక్యతా పోరాటాలే పాఠాలు చెప్తున్నాయి. వెట్టిచాకిరికి వ్యతిరేకంగా భూమి, భుక్తి, విముక్తి కోసం జరిగిన పోరాటాల్లో అట్టడుగు కులాలు, వర్గాలన్నీ కలిసి పనిచేశాయి.

బీసీలంతా ఒక్కతాటిపైకి తప్పక వస్తారు. 'మా వాటా మాకే'నంటూ ఒక జాయింట్ యాక్షన్ కమిటీగా ఏర్పడే సమయం ఆసన్నమైంది. తెలంగాణలోని అన్ని పార్టీల్లో 2 కోట్లమంది బీసీలు ఉన్నారు. బీసీలు లేకపోతే రాజకీయ పార్టీలు కుప్పకూలి కునారిల్లిపోతాయి. బీసీల దీర్ఘకాలిక హక్కుల సాధన కోసం అన్ని పార్టీల్లో ఉన్న బీసీలు ఒక దగ్గరకు జమకావాలి. స్థానిక సంస్థల నుంచి చట్టసభల వరకు బీసీ రిజర్వేషన్లు సాధించుకునే వరకు, కుల గణన జరిగేవరకు బీసీలు సామూహిక గొంతుకగా మారాలి. బీసీ చైతన్యాన్ని చెల్లాచెదురు చేయాలని చూసేవాళ్ల కుట్రల్ని భగ్నం చేయాలి. 'బీసీలంతా సంఘటితమై జేఏసీగా ఏర్పడి ఒక్క గొంతుకగా గర్జిస్తున్నాం.. చూడండి' అన్న ఐక్యతాపాఠం కూడా చరిత్రకందించాలి.

నాటి తెలంగాణ సాయుధ పోరాటానికి ముందుగా ఏర్పడ్డ ఆంధ్ర మహాసభల్లాగా, తెలంగాణ స్వరాష్ట్రం కోసం ఏర్పడ్డ తెలంగాణ జేఏసీ లాగా, బీసీలకు స్థానిక సంస్థల్లో సమ వాటా, చట్టసభల్లో రిజర్వేషన్లు, సమగ్ర బీసీ కులగణన కోసం ఊరికొక జేఏసీ రావాలి. కుల, విద్యార్థి, మేధావి, ఉపాధ్యాయులు, కార్మిక, కర్షకులు, ఉద్యోగులు అంతా కలిసి బీసీ జేఏసీగా ఏర్పడాలి. 'మనం విడిపోతే చీలిపోతాం, కలిసుంటే గెలిచి తీరుతాం' అన్న సోయి బీసీల్లో పెరిగింది. మన సీట్లు మనకొస్తేనే బాగుపడతాం. బీసీల ఐక్యతే దేశసమైక్యత. బీసీల సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయం కోసం గళం విప్పుదాం. గర్జనలు చేద్దాం.

(వ్యాసకర్త: తెలంగాణ రాష్ట్ర తొలి బీసీ కమిషన్ సభ్యులు)